క్లుప్తంగా

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

గంగాధర : పేద ప్రజలకు అండగా ప్రభుత్వం సీఎం సహాయనిధిని అందిస్తున్నట్లు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 42 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.11,14,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రిలో అత్యవసర సమయాల్లో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం సీఎం సహాయనిధి అందిస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. ఇక్కడ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం

రామడుగు : మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఈరెల్లి శేఖర్ ప్రమాదవశాత్తు మృతిచెందగా శేఖర్ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శేఖర్ కుటుంబ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా మృతుడి కుమారుడు సాత్విక్‌కు పాఠశాల ఫీజుతో పాటుగా అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు.

వెదిరలో ఇంటింటా సర్వే


సర్వేచేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

రామడుగు: మండలంలోని వెదిరలో ఆదివారం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు నిరుద్యోగ, నిరక్షరాస్యత, యువత గణన జాతీయస్థాయి సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టిన దత్తత గ్రామాల్లో 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల వారి వివరాలతో కూడిన సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా వెదిరలో 750 ఇళ్లలో సమాచారాన్ని సేకరించినట్లు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు ఇన్‌చార్జి బి.సురేశ్‌కుమార్ తెలిపారు. కాగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుధారాణి చిరుధాన్యాల ప్రాముఖ్యతను వలంటీర్లకు వివరించారు.

సిర్సపల్లిలో..

హుజూరాబాద్ రూరల్ : మండలంలోని సిర్సపల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కొనసాగుతోంది. శనివారం గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు యువత వ్యక్తిత్వ వికాసం, తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్వేలో 15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల్లోపు వయస్సుగల యువతకు లభిస్తున్న విద్య, ఉపాధి అవకాశాలపై సమగ్ర సర్వే నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ వెంకట్రావ్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పనులు ప్రారంభించాలి


మాట్లాడుతున్న యువజన సంఘాల నాయకులు

గన్నేరువరం : గుండ్లపల్లి స్టేజీ నుంచి వయా గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వం ప్రారంభించాలని యువజన సంఘాల నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, సంపతి ఉదయ్ కోరారు. ఆదివారం గుండ్లపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని గుండ్లపల్లి నుంచి గునుకుల కొండాపూర్ వరకు బీటీ రోడ్డును తవ్వి మట్టి పోసి నిర్లక్ష్యంగా వదిలేశారని, దుమ్ము ధూళితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.71 కోట్లు మంజూరయ్యాయని తెలిపిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పనులను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. పనులను ప్రారంభించకపోతే పెద్దఎత్తున ధర్నా చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ముస్కు ఉపేందర్ రెడ్డి, పరిపూర్ణచారి, శ్రీధ ర్ రెడ్డి, మల్లేశం, రవీందర్ రెడ్డి, వెంకట రమణారెడ్డి, పవన్ రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరావాలి

కరీంనగర్: టీచర్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, అన్ని రకాల బిల్లులను సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



ఇల్లందకుంట: మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో (1987-88) పదో తరగతి బ్యాచ్ 50 మంది పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివిన రోజులను గుర్తు చేసుకున్నారు. తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకొని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కొమ్మెర దేవేందర్ రెడ్డి, సుఖ్‌దేవ్, మురళీధర్, రామాచార్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామిరెడ్డి, కలాలి రాజిరెడ్డి, కనుకుల రామిరెడ్డి, రవేశ్, నిరంజన్, వేణు, శ్రీనివాస్, మమ త, అనిత, శ్రీదేవి, సరస్వతి పాల్గొన్నారు.

పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి


రవీందర్ రెడ్డి

శంకరపట్నం: పురుషుల పొదుపు సమితి శంకరపట్నం మండల అధ్యక్షుడిగా వంగల రవీందర్‌రెడ్డి ఏడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమితి 21వ వార్షిక మహాసభ నిర్వహించారు. మహాసభలో సభ్యులు తీసుకున్న రుణాలు, చెల్లింపులు, బకాయిలు, సంఘం బలోపేతానికి చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నరహరి రాజిరెడ్డి ఎన్నికయ్యారు. సహవికాస అధికారి రాజశ్రీ, ధర్మకర్త రమాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్ గురించి వివరిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఆదివారం సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెస్పిరేషన్)పై పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటుతో మృత్యువాత పడుతున్నారన్నారు. అనంతరం సీపీఆర్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్, వైద్యులు సురేశ్, నారాయణరెడ్డి, సుధాకర్, సీఐలు బొల్లం రమేశ్, రాంచందర్ రావు, జనార్దన్ రావు, జవ్వాజి సురేశ్, ఎస్‌ఐలు రాజన్న, ఆరోగ్యం, చంద్రశేఖర్, శేఖర్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి


పోషణ్ అభియాన్‌లో సర్పంచ్, అంగన్‌వాడీ టీచర్లు

తిమ్మాపూర్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సర్పంచ్ తోట మమత అన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో పోషణ్ అభియాన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. దీంతో రక్తహీనతకు గురికాకుండా ఉంటారన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని సూచించారు. అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, హెల్త్ సభ్యులు గ్రామంలో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఎం గుర్మిల్ సింగ్, గడప శేఖర్, అంగన్‌వాడీ టీచర్లు భాగ్య, లక్ష్మి రేణుక, తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్ రెడ్డి సంఘం వార్షిక మహాసభ

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ రెడ్డి సంఘం ఐదో వార్షిక మహాసభ ఆదివారం నిర్వహించారు. సంఘం భవన నిర్మాణం, సభ్యులకు రుణాలు, సభ్యత్వాలు గణకుడు రాధస్వామిరెడ్డి వివరించారు. ఐక్యతతోనే సంఘం బలోపేతం అవుతుందని సంఘం అధ్యక్షుడు అంతం శభావస్కర్ రెడ్డి అన్నారు. పదవీకాలం ముగిసిన పాలకవర్గం సభ్యుల స్థానంలో కొత్తవారిని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా అంతం సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా అంతం రాజిరెడ్డి, సభ్యులుగా గూడ నర్సిరెడ్డి, ఎన్నారపు రాంరెడ్డి, ఉప్పుల రవీందర్ రెడ్డి, అంతం వాసుదేవరెడ్డి, రామిడి రాధాస్వామి రెడ్డి ఎన్నికయ్యారని వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. నూతన కమిటీని మాజీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి, కృష్ణారెడ్డి సన్మానించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కు అందజేస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆడబిడ్డల పెళ్లికి అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఆదివారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ ఒక్కో రంగంపై దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నారని, ప్రాజెక్టులు, చెరువుల పునరుద్ధరణ, రైతుబంధు, రైతు బీమా పథకాలు, పల్లె, పట్టణ ప్రగతి తదితర కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్ రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, ఆయా వార్డు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్

ఇల్లందకుంట: మండలంలోని బూజునూరు, సీతంపేట గ్రామాల్లో జమ్మికుంట పట్టణంలోని చాణక్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు నిర్వహిస్తున్న శిబిరం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం బూజునూరు సర్పంచ్ సరిగొమ్ముల అరుణసదానందం, సీతంపేట సర్పంచ్ వెంకటస్వామి మాట్లాడారు. విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాల ద్వారా గ్రామాలలో పారిశుధ్యం, హరితహారం,ఇంకుడుగుంతలు, వ్యక్తిగతమరుగుదొడ్లు, మూఢనమ్మకాలపై గ్రామస్తులను చైతన్యపర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ప్రభాకర్, శ్రీనివాస్, విజేందర్,శివ, ప్రిన్సిపాల్ చిరంజీవి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, సాయికృష్ణ, వంశీకృష్ణ, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు షురూ

- ఇసుక లారీలతో గుంతలమయంగా తయారైన రహదారులు
- తారురోడ్ల రెన్యువల్ పనులకు నిధులు మంజూరు
- హర్షం వ్యక్తంచేస్తున్న ప్రయాణికులు, వాహనదారులు


లక్ష్మీపూర్‌లో రోడ్డు పనులు

మానకొండూర్: మండలంలోని పలు రహదారులు ఇసుక లారీలతో అధ్వాన్నంగా మారాయి. రహదారులు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టకేలకు తారురోడ్ల రెన్యూవల్ కోసం నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుంతల రోడ్డుతో ఇబ్బందులు..

మానకొండూర్ నుంచి వేగురుపల్లి వరకు ఇసుక లారీలు, ట్రాక్టర్లతో రహదారులు గుంతలమయంగా మారాయి. దీంతో గుంతలరోడ్డుతో పాటు దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై వెళ్లాలంటే నరకం అనుభవించేవారు. మానకొండూర్ నుంచి ఊటూరు రోడ్డు అధ్వాన్నంగా మారింది. ఓ వైపు వివిధ గ్రామాల ప్రజలు ఇసుక లారీలు, ట్రాక్టర్లతో ఇబ్బందులు పడుతున్నామని లారీలను అడ్డుకుంటున్న ఘటనలు కూడా ఉన్నాయి. తాజాగా మానకొండూర్ మండల కేంద్రంలో రెండ్రోజులుగా ఇసుక లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పల్లెమీద రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. మానేరు వాగునుంచి నిత్యం వందలాది లారీలు, ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారని, దీంతో రహదారులు గుంతలమయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ధర్నా నిర్వహించగా తూర్పు దర్వాజ నుంచి పల్లెమీద వరకు తారురోడ్డు వేస్తామని చెప్పగా ఇంతవరకూ వేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు రెండుగంటల పాటు రాస్తారోకో చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఎస్సై తిరుపతి అక్కడికి చేరుకుని గ్రామస్తులకు సర్దిచెప్పి రాస్తారోకో విరమింపజేశారు. గుంతల రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని, రహదారిపై కనీసం నీరు పట్టడం లేదని మానకొండూర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా తారు రెన్యువల్ పనుల కోసం నిధులు మంజూరు కాగా వాహనదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే లక్ష్మీపూర్ వేగురుపల్లి గ్రామాల మధ్య రోడ్డు పనులను కాంట్రాక్టర్ చేపట్టారు.


మానకొండూర్‌లో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

నిధులు మంజూరు ఇలా..

గ్రామాలు	దూరం	నిధులు
వెల్ది– పచ్చునూర్	5 కి.మీ	రూ.1.10 కోట్లు
పచ్చునూర్ –వేగురుపల్లి	4.2 కి.మీ	రూ.91 లక్షలు
ఊటూరు –పచ్చునూర్	4 కి.మీ	రూ.1.15కోట్లు
ఊటూరు –మామిడాల పల్లె	6.5 కి.మీ	రూ. 1.32కోట్లు

ఇళ్ల స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జమ్మికుంట : పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి పదేళ్లు గడుస్తుందని, స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయాలని సీపీఎం జోన్ కమిటీ నాయకుడు కొప్పుల శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని సైదాబాద్‌లో పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలపై ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, పేదలకు దక్కాల్సిన స్థలాలు దక్కడం లేదని ఆరోపించారు. గ్రామంలో రోడ్డు, మహిళా సమాఖ్య భవనం, యూత్ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రావుల ఓదెలు, దాసరి మొగిలి, సాగర్ల శ్రీకాంత్, సత్యం, సదానందం, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లతో ఆర్థికాభివృద్ధి

ఏటా వందశాతం రుణాలు వసూళ్లు, వెన్నంపల్లి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి


సభలో మాట్లాడుతున్న చైర్మన్ బిల్లా వెంకట్‌రెడ్డి, తదితరులు

సైదాపూర్ : ధాన్యం కొనుగోళ్లతో సహకార సంఘం ఆర్థికాభివృద్ధి చెందుతుందని వెన్నంపల్లి సహకార సంఘం చైర్మన్ బిల్లా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ చైర్మన్ బిల్లా వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లతో రూ.కోటివరకు కమీషన్ రూపంలో సంఘానికి నిధులు సమకూరాయని తెలిపారు. ఇప్పటికే సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్, గోదాం నిర్మాణం పూర్తికాగా ఎగ్లాస్‌పూర్‌లో గోదాం, వెన్నంపల్లిలో సహకార సంఘం నూతన భవనాలకు భూమిపూజ చేసినట్లు చెప్పారు. ఏటా వందశాతం రుణాల వసూళ్లతో సంఘానికి మంచి గుర్తింపు ఉందని, అందుకు ఏటా రూ. 50వేలు బహుమతిగా వస్తున్నట్లు తెలిపారు. డైరెక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, చైర్మన్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, సర్పంచులు రాజిరెడ్డి, పాపయ్య, చిరంజీవి, ఎంపీటీసీ విజయ, డైరెక్టర్లు, సీఈవో మల్లారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తక్కువ ప్రీమియం.. ఎక్కువ బోనస్


మాట్లాడుతున్న పసునూరి ప్రభాకర్

హుజూరాబాద్ రూరల్ : పోస్టాఫీస్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హుజూరాబాద్ సబ్ డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ ఆఫీసర్ పసునూరి ప్రభాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో 28వ ఆర్‌పీఎల్‌ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హుజూరాబాద్, జమ్మికుంట పోస్టల్ బ్రాంచ్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలపై ఉద్యోగులు అవగాహన కల్పించాలన్నారు. తపాలా శాఖలో ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ పాలసీలు అతి తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్ వస్తుందన్నారు. 18 నుంచి 55 సంవత్సరాల్లోపు వారికి ఈ పథకాలు వర్తిస్తాయన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో ఏసీపీలు సునీల్ కుమార్, అనంతరామ్ నాయక్, ఇన్‌స్పెక్టర్ నరేశ్, ఐపీపీబీ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌పీఎంలు చంద్ర మోహన్, గోపికిషన్, ఎస్‌పీసీ మేనేజర్ తిరుమలేష్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

యువకులు అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

కరీంనగర్‌రూరల్: అంబేడ్కర్ కలలుగన్న సమసమాజ నిర్మాణానికి యువకులందరూ కృషి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ కోరారు. ఆదివారం కరీంనగర్ మండలంలోని ఇరుకుల్లలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ స్ఫూర్తితో ప్రజలందరూ ముందుకు సాగాలన్నారు. రాజ్యాంగాన్ని రచించిన ఆయన దళితులకు మాత్రమే ఆరాధ్యుడు కాదని భారతీయులందరికీ చెందిన ఆస్తి అన్నారు. దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, సర్పంచులు బలుసుల శారద, జక్కం నర్సయ్య, పురుమల్ల శ్రీనివాస్, దబ్బెట రమణారెడ్డి, తప్పెట్ల భూమయ్య, బోగొండ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు బుర్ర తిరుపతిగౌడ్, సర్వర్, ఉపసర్పంచు సుంకిశాల సంపత్‌రావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జమ్మికుంట: రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్ అన్నారు. ఆదివారం జమ్మికుంటలో శ్రీనివాస్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కార్మికులకు పనిముట్లు, భద్రత పరికరాలు అందించాలని, కాంట్రాక్టర్ల దోపిడీ అరికట్టాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్, కార్మి కులు కుమార్, రాకేష్, శ్రీకాంత్, నాగరాజు, ఉపేందర్ స్వామి, మొగిలి, అరుణ, స్వరూప పాల్గొన్నారు.

‘మట్టి దారులను సీసీరోడ్లుగా మారుస్తాం’

కరీంనగర్ సిటీ: కరీంనగర్ నగరపాలక సంస్థ డివిజన్ల పరిధిలోని మట్టి దారులను సీసీరోడ్లుగా మార్చడానికి అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని మేయర్ సునీల్‌రావు తెలిపారు. నగర అభివృద్ధిలో భాగంగా ఆదివారం 21, 22, 40వ డివిజన్ల కార్పొరేటర్లు భూమగౌడ్, గంట కల్యాణి, జంగిలి సాగర్‌లతో కలిసి, పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. స్మార్ట్‌సిటీ రోడ్ల నిర్మాణంతోపాటు మట్టి దారులను సీసీ రోడ్లుగా మార్చే పనులు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం వచ్చే నాలుగు మాసాల్లో రూ.400 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత వేసవిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మంచినీరు సరఫరా చేస్తున్నామని అన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

ఇల్లందకుంట : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకల రవీందర్ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డిని సస్పెండ్ చేసి కమిటీని రద్దు చేయాలన్నారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మారేపల్లి మొగిలయ్య, స్వప్న, లలిత, ప్రశాంత్, రమేశ్, శ్రీ నివాస్, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న బీఎస్పీ నాయకులు